సాక్షి
మంచిర్యాల
గురువారం : 18 : జూలై : 2024



ఇంకా తేలని 'వాటా'

సింగరేణిలో ప్రతీ సంవత్సరం ఇచ్చే లాభాల్లో వాటా కోసం ఉద్యోగులు ఎదురు చూస్తున్నారు. ఈ ఏడాది లాభాల్లో వాటా 35శాతం ప్రకటించాలని కార్మిక సంఘాలు కోరుతున్నాయి. 8లో▸



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

రాష్ట్రంలోని ఆర్‌ఎంపీ, పీఎంపీలకు శిక్షణ ఇప్పించి సర్టిఫికెట్లు అందజేస్తామని సీఎం ప్రకటించడంపై హర్షం వ్యక్తమవుతోంది. జిల్లాలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. 9లో▸

గరిష్ఠం/కనిష్ఠం
29.0 /26.0

వాతావరణం

ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసే అవకాశం ఉంది. పిడుగులు పడవచ్చు. పశ్చిమ వాయువ్యం దిశగా ఈదురుగాలులు బలంగా వీస్తాయి.

అప్పుడే ఆనందం..

- నేడు రైతుల రూ.లక్షలోపు రుణాలు మాఫీ
- జిల్లాలో అర్హులైన రైతులు 28,926 మంది
- రైతువేదికల్లో సంబరాలకు ఏర్పాట్లు
- పాల్గొననున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



నెన్నెల మండలం చిత్తపూర్ రైతువేదిక

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో రైతుల రుణమాఫీకి ప్రభుత్వం అంతా సిద్ధం చేసింది. మొదటి విడత రూ.లక్షలోపు రుణాలు పొందిన రైతులు 28,926మంది ఖాతాల్లో గురువారం నగదు జమ కానుంది. జిల్లాలో వీడియో కాన్ఫరెన్స్ వినియోగంలో ఉన్న 17రైతువేదికల్లో అర్హులైన రైతులతో సంబరాలకు ఏర్పాట్లు చేశారు. ఎంపిక చేసిన రైతువేదికల్లో అర్హులైన 200 మంది రైతులు, అధికారులు, బ్యాంకర్లు, ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, ప్రజాప్రతినిధులు పాల్గొననున్నారు. ఈ కార్యక్రమాలకు 15మంది మండల వ్యవసాయ అధికారులు, ఇద్దరు ఉద్యానవన శాఖ అధికారులు నోడల్ అధికారులుగా వ్యవహరిస్తారు. మధ్యాహ్నం 3గంటలకు హైదరాబాద్ నుంచి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రుణమాఫీని లాంఛనంగా ప్రారంభించి రైతులతో ముఖాముఖి మాట్లాడనున్నారు. సాయంత్రంలోగా అర్హులైన రైతుల ఖాతాల్లో నేరుగా నగదు జమ చేస్తారు. రైతువేదికల వద్ద ప్రజాప్రతినిధులు, రైతులు మిఠాయిలు పంచుకుని, టపాసులు కాల్చి సంబరాలు చేసుకోనున్నారు. ఇప్పటివరకు తీసుకున్న అప్పులకు వడ్డీలు పెరిగి ఇబ్బందులు పడుతున్న రైతులకు భారీ ఊరటనిచ్చేలా ప్రభుత్వం రుణమాఫీ అమలు చేస్తోంది.

రూ.200 కోట్లు

గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు రైతు రుణమాఫీపై రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది. 2018 డిసెంబర్ 12 నుంచి 2023 డిసెంబర్ 9వరకు రూ.2లక్షల రుణం పొందిన రైతులకు రుణమాఫీ పథకం వర్తిస్తుంది. గురువారం మొదటి విడత రూ.లక్షలోపు రుణాలు ఉన్న రైతులకు నిధులు విడుదల చేస్తారు. సుమారుగా రూ.200 కోట్ల వరకు రైతుల ఖాతాల్లో నగదు జమ కానుంది. జిల్లాలో రూ.2లక్షల వరకు రుణాలు పొందిన రైతులు 94వేల మంది ఉన్నారు. వీరికి గాను రూ.800 నుంచి రూ.900 కోట్ల వరకు నగదు జమ కానుంది. ఆగస్టు 15లోగా రైతుల ఖాతాల్లో నగదు జమ అవుతుంది. మొదట చిన్న మొత్తం నుంచి పెద్ద మొత్తం వరకు రుణమాఫీ కానుంది. ఇందుకు సంబంధించి ప్రతీ బ్యాంకులోనూ ఒక నోడల్ అధికారిని నియమిస్తారు. రుణమాఫీ వర్తించే మొత్తం కంటే అధికంగా ఉన్న రుణాన్ని మొదట బ్యాంకుకు చెల్లించాలి. ఆ తర్వాత రూ.2లక్షలు రైతు కుటుంబీకుల రుణ ఖాతాలకు బదిలీ చేస్తారు.



దండేపల్లి: ద్వారాక రైతువేదికలో ఏర్పాట్లు

పట్టాపాసు పుస్తకమే..

రుణమాఫీకి తెల్ల రేషన్‌కార్డును ప్రామాణికంగా తీసుకోవడంతో రైతుల్లో ఆందోళన వ్యక్తం కాగా.. మంగళవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి కలెక్టర్లతో నిర్వహించిన సమావేశంలో తెల్లరేషన్ కార్డు ప్రామాణికం కాదని, పట్టా పాస్‌పుస్తకం ప్రకారమే రుణమాఫీ చేస్తామని, రేషన్‌కార్డు కుటుంబ నిర్ధారణ కోసమే పరిగణనలోకి తీసుకున్నామని ప్రకటించడతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలు రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. పీఎం కిసాన్ నిబంధనలు కొన్నింటిని అమలు చేయనున్నట్లు ప్రకటించింది. గతంలో రైతువారీగా రుణమాఫీ ప్రక్రియ సాగింది. ఈసారి రైతు కుటుంబాల వారీగా రుణాలు మాఫీ కానున్నాయి. దీంతోపాటు ఐటీ చెల్లించే రైతులు, ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబం తదితర నిబంధనలతో కొందరు మాఫీకి దూరమయ్యే పరిస్థితి నెలకొంది. కొందరు వృద్ధులైన రైతులు 2018 డిసెంబర్ 12 నుంచి 2023 డిసెంబర్ 9 మధ్య కాలంలో తమ వారసులకు విరాసత్ కింద భూమి బదలాయించారు. గత ఏడాది వానాకాలం సమయంలో ఓ రైతు బ్యాంకు నుంచి రుణం తీసుకుని ఈ ఏడాది వారసులకు భూమి ఇస్తే ఆ రైతుకు ఇప్పుడు భూమి ఉండదు. పట్టా పాస్‌పుస్తకం ఉండదు. ఆ రైతు కుటుంబం మాఫీ అవుతుందని పాత రుణం చెల్లించలేదు.. కొత్త రుణం పొందలేదు. ఇప్పుడు ఆ రైతుకు రుణమాఫీ వర్తిస్తుందా లేదా అనే సందేహం వ్యక్తమవుతోంది.

జిల్లాలో అర్హులైన రైతులు

మండలం	రైతువేదిక	రైతులు
బెల్లంపల్లి	కన్నాల	852
భీమారం	భీమారం	1,076
భీమిని	భీమిని	810
చెన్నూర్	కిష్టంపేట	2,514
దండేపల్లి	ద్వారాక	3,353
హాజీపూర్	గుడిపేట	1,735
జన్నారం	జన్నారం	4,273
కన్నెపల్లి	కన్నెపల్లి	1,321
కాసిపేట	ముత్యంపల్లి	1,031
కోటపల్లి	కోటపల్లి	2,045
లక్సెట్టిపేట	లక్సెట్టిపేట	2,587
మంచిర్యాల	సీతారాంపల్లి	109
మందమర్రి	మందమర్రి	1,091
నెన్నెల	అవుడం	1,669
తాండూర్	తాండూర్	1,216
వేమనపల్లి	వేమనపల్లి	1,155
నస్పూర్	---	152
మొత్తం	28,926 మంది	

హామీ నిలబెట్టుకుంది..



గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకొంది. మొదటి విడత లిస్టులో నా పేరు వచ్చింది. ఒకే విడతలో రుణమాఫీతో రూ.60 వేలు మాఫీ కావడం చాలా ఆనందంగా ఉంది.

– చెన్నోజు శ్రీనివాస్, నెన్నెల

రైతులకు ఎంతో మేలు..



ప్రభుత్వం రైతుల మీద ఉన్న చిత్తశుద్ధితో ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ హామీ నిలబెట్టుకోవడం ఎంతో హర్షణీయం. గత ప్రభుత్వం నాలుగైదు విడతలతో బ్యాంకుల చుట్టూ తిప్పుకుంది. ఇప్పుడు నాకు రూ.84 వేలు రుణమాఫీ చేయడం ప్రభుత్వ మేలు మార్చిపోలేను.

– బోరిగాం జలపతి, గ్రామం: జన్కాపూర్, మం: కన్నెపల్లి

నాకు రూ.42 వేలు మాఫీ



మొదటి విడతలో లోను మాఫీ అయితందని వ్యవసాయ అధికారులు తెలిపింద్రు. రేపు రైతు వేదికకాడికి రావాలన్నారు. నేను మొదట నమ్మలేదు. ఎప్పటి నుంచో మాఫీ అంటున్నరు కానీ అది అయింది లేదు పొయ్యేది లేదు అనుకున్నా.. నాకు రూ.42 వేల లోను మాఫీ ఎంతో ఆనందంగా ఉంది. మాలాంటి వ్యవసాయం చేసుకునేటోళ్లకు ఇంత మేలు చేస్తే ఇంకా పంటలు పండించుకుంటాం..

– ఇండ్ల రాజవ్వ, గ్రామం: ద్వారాక, మం: దండేపల్లి

మూడు విడతల్లో మాఫీ

నెల రోజుల వ్యవధిలో నిర్ణీత మొత్తాన్ని మూడు విడతల్లో రుణమాఫీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మొదటి విడత గురువారం జమ చేయనుంది. రెండో విడత రూ.1.50లక్షలు నెలాఖరు వరకు జమ చేయాలని, మూడో విడత ఆగస్టు మొదటి వారం నుంచి 15లోగా నిధులు విడుదల చేయాలని నిర్ణయించింది. రెండో విడత జాబితాలో 34 వేల నుంచి 36 వేల మంది వరకు రైతులు ఉన్నారు. జిల్లాలో ఎంతమంది అర్హులైన రైతులు ఉన్నారనే సమాచారం వ్యవసాయ అధికారులు, లీడ్‌బ్యాంక్ మేనేజర్ వద్ద కాని లేదు.

హలో కమిషనర్ గారు..!

- బెల్లంపల్లి మున్సిపల్ కమిషనర్‌తో 'సాక్షి 'ఫోన్‌ఇన్
- రేపు ఉదయం 9గంటల నుంచి 10గంటల వరకు



వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్, బెల్లంపల్లి

బెల్లంపల్లి: వర్షాకాలం సీజనల్ వ్యాధుల కాలం. మున్సిపాల్టీలో పారిశుధ్యం లోపించి, కాలువల్లో మురికి నీరు స్థిరంగా నిలిచి ఉండి, రహదారుల పక్కన, ఖాళీ ప్రదేశాలు, ఇళ్ల పరిసరాల్లో వ్యర్థాలు పేరుకుపోయి ఉండడం వల్ల దోమలు వృద్ధి చెందుతాయి. డెంగీ, మలేరియా వంటి జ్వరాలు, సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉంటాయి. ఈ క్రమంలో పట్టణంలోని ఆయా సమస్యలపై బెల్లంపల్లి మున్సిపల్ కమిషనర్ ఎస్.వెంకటేశ్వర్లుతో పట్టణ ప్రజలు నేరుగా మాట్లాడే అవకాశాన్ని కల్పిస్తోంది.

సంప్రదించాల్సిన ఫోన్ నంబర్:
98499 05887

ఘనంగా తొలి ఏకాదశి



రుద్రాభిషేకం పూజల్లో భక్తులు

మంచిర్యాలఅర్బన్: జిల్లాలో బుధవారం తొలి ఏకాదశి పండుగను ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. మంచిర్యాలలోని విశ్వనాథ స్వామి దేవస్థానంలో వేంకటేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. తెలంగాణ తల్లి చౌరస్తా రోడ్‌నంబరు–1లో శివపంచాయితన ఆలయంలో శివునికి మహాన్యస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. హైటెక్‌సిటీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు తనయుడు చరణ్ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సన్మానించారు.

న్యూస్‌రీల్

పోలీసు బెటాలియన్ కమాండెంట్ బదిలీ



జమీల్‌భాషాను సన్మానిస్తున్న అధికారులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గుడిపేట 13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్ కమాండెంట్ సయ్యద్ జమీల్‌భాషా పూర్తిస్థాయి కమాండెంట్‌గా పదోన్నతిపై 3వ బెటాలియన్ కమాండెంట్‌గా బదిలీ అయ్యారు. ఇబ్రహీంపట్నం 3వ బెటాలియన్ కమాండెంట్‌గా బదిలీపై వెళ్తున్న సయ్యద్ జమీల్ భాషాను బుధవారం బెటాలియన్ పోలీస్ అధికారులు, మినిస్టీరియల్ సిబ్బంది శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా కమాండెంట్ జమీల్‌భాషా మాట్లాడుతూ పోలీసులు ప్రజలతో మమేకమై విధులు నిర్వర్తిస్తేనే ప్రజలు గుర్తిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ రఘునాథ్ చౌహాన్, ఆర్ఐలు, ఏఆర్ఎస్సైలు, మినిస్టీరియల్ సిబ్బంది, హెడ్ క్వార్టర్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంచార్జి కమాండెంట్‌గా శ్రీనివాస్‌రావు

13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్ ఇంచార్జి కమాండెంట్‌గా సిరిసిల్ల 17వ బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ శ్రీనివాస్‌రావును నియమించారు. గురువారం ఆయన బాధ్యతలు చేపట్టనున్నట్లు తెలుస్తోంది.

భక్తిశ్రద్ధలతో మొహర్రం



పీరీల వద్ద మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాలలో మొహర్రం (పీరీల) భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు పట్టణంలో పీరీల వద్ద భక్తుల సందడి నెలకొంది. వర్షం కురిసినప్పటికీ భక్తులు మొక్కులు తీర్చుకునేందుకు తరలివచ్చారు. హస్సేన్, హుస్సేన్‌లను కొలుస్తూ వారి త్యాగాలను స్మరించారు. ఉపవాస దీక్షలతో పీరీల ఊరేగింపు నిర్వహించారు. కుల, మతాలకతీతంగా అందరూ మొక్కులు చెల్లించుకున్నారు. బుధవారం సాయంత్రం వేళల్లో పీరీల గుండం వద్దకు చేరి మంటలు వేసుకుని గుండం చుట్టూ డప్పుచప్పుళ్ల మధ్య పాటలు పాడుతూ నృత్యాలు చేశారు. అసైదులా ఆటలు పట్టణ పురవీధుల్లో అంబరాన్నంటాయి. చిన్నారులు, మహిళలు కుడుకల దండలు, చక్కెర గుళికల పేర్లతోపాటు దస్తీ(ఖర్చీఫ్)లను పీరీలకు కట్టారు. మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు పీరీలను దర్శించుకున్నారు. రాత్రి పట్టణంలోని పోచమ్మ చెరువు, రాళ్ల వాగుల్లో పీరీలను నిమజ్జనం చేశారు. స్థానిక విశ్వనాథ ఆలయానికి వచ్చే భక్తులు, ముఖరాం చౌరస్తాలో పీరీల ఏర్పాటుతో వాహనాలు వెళ్లకుండా పోలీసులు ట్రాఫిక్ నియంత్రణ, బందోబస్తు చేపట్టారు.


పెండింగ్ డీఏలు ప్రకటించాలి



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

మంచిర్యాలఅర్బన్: జూలై 2022 నుంచి ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్నా ఐదు డీఏలను వెంటనే ప్రకటించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. బుధవారం తపస్ కార్యాలయం జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఆర్సీ గడువు ముగిసి సంవత్సర కాలం గడిచినప్పటికీ ప్రభుత్వం ఊసెత్తకపోవడం శోచనీయమని అన్నారు. బహుళ సబ్జెక్టుల పదోన్నతుల కారణంగా ఏర్పడిన ఖాళీలను అర్హులైన ఎస్జీటీలతో భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. బదిలీ అయిన ఉపాధ్యాయులందరినీ రిలీవ్ చేసి కొత్త ఉపాధ్యాయులు వచ్చే వరకు వారి పాత పాఠశాలలో కొనసాగేలా వర్క్ అడ్జస్ట్‌మెంట్ ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ఉపాధ్యాయ సమస్యలపై ప్రభుత్వం చొరవ తీసుకోవాలన్నారు. రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి బండి రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి బగ్గని రవికుమార్, రాష్ట్ర అకాడమిక్ కో–కన్వీనర్ విద్యాసాగర్, ఉపాధ్యక్షుడు రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

పే..ద్ద చేప



చేపను చూపిస్తున్న జాలర్లు

లక్సెట్టిపేట: పట్టణానికి చెందిన జాలర్లు మేడి చంద్రయ్య, పెద్దయ్యకు స్థానిక గోదావరి నదిలో బుధవారం సుమారు ఇరవై కిలోల బొచ్చె చేప లభించింది. రోజు మాదిరిగానే గోదావరి నదిలో చేపలు పట్టడానికి వెళ్లి వల వేసి లాగడంతో పెద్ద బొచ్చె చేప పడింది. స్థానిక మార్కెట్‌లో విక్రయిస్తామని జాలర్లు తెలిపారు.

ఖాకీ కవచాలు



రెస్క్యూ టీం సభ్యులతో సీపీ, అప్పటి కలెక్టర్ సంతోష్ (ఫైల్)

- 50మందితో ప్రత్యేక రెస్క్యూ టీం
- ఎన్‌డీఆర్‌ఎఫ్ ఆధ్వర్యంలో శిక్షణ
- విపత్తుల వేళ రక్షణ కల్పించేందుకే..

మంచిర్యాలక్రైం: ఎంతటి కఠిన సవాళ్లనైనా ఎదుర్కొనేందుకు పోలీస్‌శాఖ సిద్ధంగా ఉంటుంది. ఇందులో భాగంగానే విపత్తుల వేళ ఓ ప్రత్యేక టీం ఉంటే బాగుంటుందని రామగుండం సీపీ శ్రీనివాసులు భావించారు. తన ఆలోచనను అప్పటి కలెక్టర్ బదావత్ సంతోష్ దృష్టికి తీసుకెళ్లారు. సానుకూలంగా స్పందించిన కలెక్టర్ అన్ని ఏర్పాట్లకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వెంటనే రామగుండం కమిషనరేట్ పరిధిలోని ఒక్కో పోలీస్‌స్టేషన్ నుంచి మెరికల్లాంటి 50మంది కానిస్టేబుళ్లను ఎంపిక చేశారు. వారంపాటు ఎన్‌డీఆర్‌ఎఫ్ (నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్) అధికారులతో హైదరాబాద్‌లోని నాగోల్‌లో ప్రత్యేక శిక్షణ ఇప్పించారు. వారిని సుశిక్షితులైన ఫ్లడ్ రెస్క్యూ టీంగా ఏర్పాటు చేశారు.

వానాకాలం వచ్చిందంటే వణుకు..

గతేడాదిలో వరుసగా కురిసిన భారీ వర్షాలకు జిల్లాలో అనేక మారుమూల గ్రామాలు నీట మునిగి ప్రజలు అష్టకష్టాల పాలయ్యారు. జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ నగర్, పద్మశాలీ కాలనీ, రెడ్డి కాలనీ, రాళ్లపేట, రాంనగర్, ఎల్ఐసీ కాలనీలు పూర్తిగా ముంపునకు గురయ్యాయి. నీట మునిగి ఏడాది గడిచినా నష్టాల నుంచి తేరుకోలేదు. మరో ఏడాది కూడా అదే పరిస్థితి తలెత్తి మళ్లీ ముంపునకు గురయ్యాయి. ఇలా ముంపు వరదల్లో ఎన్నో కుటుంబాలు నష్టాల నుంచి ఇప్పటికీ తేరుకోలేదు. సుమారు ఒక్కో కుటుంబం రూ.3లక్షల వరకు నష్టపోయింది. వీరికి అప్పటి ప్రభుత్వం కూడా ఎలాంటి సాయం అందజేయలేదు. ప్రతీ వానాకాలంలో జిల్లా ప్రజల్లో వణుకు మొదలవుతోంది. గతంలో కాళేశ్వరం ప్రాజెక్ట్‌తో పాటు ఎగువనున్న సుందిళ్ల, ఎల్లంపల్లి ప్రాజెక్టుల్లోకి భారీగా నీరు చేరడంతో బ్యాక్ వాటర్, గోదావరి ప్రవాహానికి తోడు, పలు కాలువలు, వాగుల నుంచి వచ్చే వరదలతో మంచిర్యాల పట్టణంలోని పలు కాలనీలు ముంపునకు గురయ్యాయి. ఆయా కాలనీల ప్రజలను కాపాడేందుకు స్థానిక పోలీసులు, మున్సిపల్ సిబ్బంది ఎంతో శ్రమించారు. ప్రస్తుతం వానాకాలం ప్రారంభమైంది. చినుకు పడితే తమ గూడు చెదిరిపోతుందనే భావనలో ఎన్నో కుటుంబాలున్నాయి. గతంలో రెండుసార్లు సంభవించిన ముంపులో భారీ నష్టాన్ని ప్రజలు చవిచూశారు. ఈ ఏడాది కూడా భారీ వర్షాలు పడితే గతేడాదిలాగే వరద కష్టాలు, నష్టాల నుంచి ప్రజలను కాపాడేందుకు రామగుండం సీపీ శ్రీనివాసులు ప్రత్యేక రెస్క్యూ బృందాన్ని సిద్ధం చేసి ఉంచారు.

ప్రజలకు అండగా ఉంటాం



కమిషనరేట్ పరిధిలో విపత్తులు సంభవించినప్పుడు ప్రజలను కాపాడేందుకు ప్రత్యేక రెస్క్యూ టీం ఏర్పాటు చేసి 50మందికి కఠోర శిక్షణ ఇప్పించాం. వరదలు, ప్రయాణాల్లో చిక్కుకుని ఇబ్బందులు పడుతున్నవారు డయల్ 100కు కాల్ చేస్తే స్థానిక పోలీసులు గాని రెస్క్యూ టీం సభ్యులు గాని వెంటనే స్పందించి రక్షణ కల్పిస్తారు. విపత్తులు సంభవించినప్పుడు అధైర్యపడొద్దు. కమిషనరేట్ పోలీసులు అండగా ఉంటారు. వానాకాలంలో ప్రజలు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలి. విపత్తుల వేళ ప్రజల ప్రాణాలను కాపాడడమే లక్ష్యంగా ఫ్లడ్ రెస్క్యూ టీంను ఏర్పాటు చేశాం.

– శ్రీనివాసులు, రామగుండం సీపీ

రెస్క్యూ టీం ఏం చేస్తుందంటే..

రామగుండం కమిషనరేట్ పరిధిలో ఏర్పాటైన రెస్క్యూ టీం కమిషనర్ పర్యవేక్షణలో పని చేస్తుంది. ఇందులో 50మంది సభ్యులు కఠోర శిక్షణ తీసుకుని ప్రాణాలనూ లెక్క చేయకుండా రంగంలోకి దిగుతారు. ప్రజలు ఎక్కడైనా ప్రమాదంలో చిక్కుకున్నారంటే స్థానిక పోలీస్‌స్టేషన్‌కు గాని లేదా డయల్ 100కు కాల్ చేసి సమాచారం అందిస్తే చాలు.. వెంటనే అక్కడికి పోలీస్ రెస్క్యూ టీం చేరుకుంటుంది. సాంకేతిక పరిజ్ఞానం, అత్యాధునిక పరికరాల ఆధారంగా ప్రమాదంలో ఉన్నవారిని ప్రాణాలతో కాపాడేందుకు టీం సభ్యులు ప్రయత్నిస్తారు. ఎక్కడైనా రాకపోకలు నిలిచిపోయేలా చెట్లు పడిపోయినా, రోడ్లు, బ్రిడ్జిలు కొట్టుకుపోయి రాకపోకలు నిలిచినా, వరదలతో కాలనీల్లోకి నీరు చేరి ప్రజలు చిక్కుకున్న వారిని కాపాడేందుకు.. రకరకాల ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు ఈ రెస్క్యూ టీం ప్రాణాలనూ లెక్క చేయకుండా ప్రజలను కాపాడుతారు.

'ముసురు'కుంది..



కోటపల్లిలో ఇటీవల కురిసిన వర్షాలతో ఎదుగుతున్న పత్తి పంట

- పత్తి పంటకు జీవం
- జిల్లాలో 15.6 మిల్లీమీటర్ల వర్షం
- ఇంకా లోటు వర్షపాతమే..

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో గత మూడు రోజులుగా ముసురుకున్న వాన పత్తి పంటకు జీవం పోసింది. బుధవారం 15.6మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఇంకా జిల్లా సాధారణ వర్షపాతం కంటే లోటుగానే నెలకొంది. ఈ మూడు రోజుల వ్యవధిలో వేమనపల్లి, కోటపల్లి, చెన్నూర్ మండలాల్లో భారీ వర్షాలు కురిశాయి. దీంతో జిల్లా సాధారణ వర్షపాతానికి దగ్గరైంది. ఈ నెల మొదటి వారంలో కురిసిన వర్షాలతో కొంత ఊరటనిచ్చినా ఆ తర్వాత ఆశించిన వర్షాలు లేవు. దీంతో రైతులు కలుపు నివారణ, ఎరువులు వేసుకున్నారు. పత్తి పంట విత్తుకొని నెల రోజులు గడిచింది. ఇప్పటికే నేల నుంచి మొకాలు ఎత్తు వరకు పెరగాల్సి ఉండగా ఆర ఫీటు ఎత్తు పెరిగి నాలుగైదు ఆకాలు వేసింది. పంట ఎదుగు బొదుగు లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పత్తి పంటకు ఊరటనిస్తున్నా వరిసాగుకు అనుకూలంగా వర్షాలు కురువడం లేదు. జలశయాల్లో నీటిమట్టం పెరగడం లేదు. ఇటు భూగర్భ జలాలు గతేడాది కంటే కిందికి పడిపోయాయి. రానున్న రోజుల్లో భారీ వర్షాలు కురిసి జలాశయాలు నిండితే తప్ప వరినాట్లు వేసుకునే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు.

11 మండలాల్లో లోటు..

జూన్ 1 నుంచి ఇప్పటివరకు జిల్లా సాధారణ వర్షపాతం 332.7 మిల్లీమీటర్లు కురువాల్సి ఉండగా 267 మిల్లీమీటర్లు కురిసింది. జిల్లా సగటున 17శాతం లోటు నెలకొంది. 11 మండలాల్లో సాధారణ వర్షపాతం కంటే 20 నుంచి 50 శాతం లోటుగా నెలకొంటే ఏడు మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. గత మూడు రోజులుగా జిల్లాలో 43 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. గతేడాది ఇదే సమయానికి 320.7 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

జిల్లాలోని ప్రాజెక్టుల్లో నీటిమట్టం(మీటర్లలో)

ప్రాజెక్టు పేరు	సాధారణ నీటిమట్టం	ప్రస్తుత నీటిమట్టం
ఎల్లంపల్లి	148.00	145.61
గొల్లవాగు	155.50	150.65
నీల్వాయి	124.00	122.40
ర్యాలీవాగు	151.50	143.50

ఆరిజిన్ డెయిరీ భూములు బాధితులకు పంపిణీ

- సీఏఓ బోడపాటి శేజల్



సమావేశంలో మాట్లాడుతున్న శేజల్

బెల్లంపల్లి: ఆరిజిన్ డెయిరీ నిర్వహణకు మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య మధ్యవర్తిత్వం వహించి తమతో కొనుగోలు చేయించిన బెల్లంపల్లిలోని భూములను తమ వల్ల నష్టపోయిన బాధితులకు పంపిణీ చేస్తామని ఆరిజిన్ డెయిరీ చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్(సీఏఓ) బోడపాటి శేజల్ తెలిపారు. బుధవారం బెల్లంపల్లి ప్రెస్‌క్లబ్‌లో ఆమె విలేకరులతో మాట్లాడారు. పాడిరైతులకు గిట్టుబాటు ధర కల్పించి, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో ఆరిజిన్ డెయిరీని ప్రారంభించాలని తలపెట్టగా.. అప్పటి ఎమ్మెల్యే చిన్నయ్య, కొందరు బీఆర్ఎస్ నాయకుల వల్ల నీరుగారిందని తెలిపారు. అప్పట్లో తమపై దాడులకు పాల్పడిన బీఆర్ఎస్ శ్రేణులు గోలి శివ, భీమ శంకర్, సాన శ్రావణ్ తదితరులపై రౌడీషీట్ ఓపెన్ చేయాలని పోలీసు అధికారులను కోరారు. తప్పుడు కేసుల వల్ల మానసికంగా ఇబ్బందులు పడ్డామని అన్నారు. ఆరిజిన్ డెయిరీలో సభ్యులుగా ఉండి నష్టపోయిన కొందరు బాధిత రైతులు, ఉపాధి కోల్పోయిన నిరుద్యోగులకు మానవతాదృక్పథంతో భూమి కేటాయించాలని నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. పాడి రైతుల కోసం త్వరలోనే డెయిరీని పునఃప్రారంభిస్తామని పేర్కొన్నారు. డెయిరీ సీఈవో కందిమళ్ల ఆదినారాయణ, ఆర్.ప్రియదర్శిని పాల్గొన్నారు.

ప్రజలతో మర్యాదగా వ్యవహరించాలి



ఎస్సై, సిబ్బందితో మాట్లాడుతున్న డీసీపీ భాస్కర్

తాండూర్: న్యాయం కోసం పోలీసుస్టేషన్‌కు వచ్చే ప్రజలతో మర్యాదగా వ్యవహరించాలని మంచిర్యాల డీసీపీ ఏ.భాస్కర్ అన్నారు. బుధవారం తాండూర్, మాదారం పోలీసుస్టేషన్లను సందర్శించారు. రికార్డులు తనిఖీ చేసి పోలీసులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ పోలీసు విధులు ఎంతో బాధ్యతాయుతంగా నిర్వర్తించాల్సి ఉంటుందని తెలిపారు. మండలంలో ప్రధానంగా కుటుంబ కలహాలు, భూ తగాదాల కేసులు వస్తున్నట్లు పేర్కొన్నారు. వీటిని కట్టడి చేయడానికి గ్రామాల్లో పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. పట్టణాల్లో కాలనీల నిద్ర పేరుతో కార్యక్రమాలకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపారు. భూ ఆక్రమణలు, తగాదాలు, మోసాలకు పాల్పడుతున్న వ్యక్తుల పట్ల కఠినంగా ఉంటామని చెప్పారు. ఒకరి వద్ద అడ్వాన్స్ తీసుకుని మరొకరికి భూ రిజిస్ట్రేషన్ చేస్తూ మోసాలకు పాల్పడుతున్న వారిని, పట్టణాల్లో ఒకే ప్లాట్‌ను ఇరువురికి అమ్మి వంచనకు గురి చేస్తున్న వ్యక్తులను ఏమాత్రం ఉపేక్షించబోమని హెచ్చరించారు. అవసరమైతే రౌడీషీట్ తెరుస్తామని తెలిపారు. మాదారం పోలీసుస్టేషన్ గ్రౌండ్‌ను పరిశీలించి ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. బెల్లంపల్లి ఏసీపీ ఏ.రవికుమార్, తాండూర్ సీఐ కుమారస్వామి, తాండూర్ ఎస్సై సిహెచ్.కిరణ్‌కుమార్, మాదారం ఎస్సై తిరుమల పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉరేసుకుని వ్యాపారి ఆత్మహత్య

లక్సెట్టిపేట: ఉరేసుకుని వ్యాపారి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై సతీష్ తెలిపిన వివరాల మేరకు మండల కేంద్రంలోని అంగడిబజార్‌కు చెందిన ప్రతాప్ (55) పాత బస్టాండ్ ప్రాంతంలో స్టీల్ బోల్ల దుకాణం నడుపుకుంటూ జీవనోపాధి పొందుతున్నాడు. కొంతకాలంగా వ్యాపారం సరిగా నడవకపోవడంతో అప్పులు చేసి ముగ్గురు స్నేహితులతో కలిసి వేరే వ్యాపారంలో పెట్టుబడి పెట్టి నష్టాలపాలయ్యాడు. అప్పులు చెల్లించే మార్గం తెలియక మనస్తాపానికి గురై ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని భార్య ఉమ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ సింగరేణి కార్మికుడు మృతి



బ్రహ్మారెడ్డి (ఫైల్)

జైపూర్: మండల కేంద్రంలోని వెలిశాల మల్లన్నస్వామి ఆలయ సమీపంలో ఈ నెల 11న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన సూరం బ్రహ్మారెడ్డి (58) చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు ఎస్సై శ్రీధర్ తెలిపారు. చెన్నూర్ పట్టణంలోని ఆదర్శ నగర్‌కు చెందిన బ్రహ్మారెడ్డి ఆర్కే6 గనిలో కోల్‌కట్టర్‌గా పని చేస్తున్నారు. 11న మధ్యాహ్నం విధులు ముగించుకుని ఇంటికి వెళ్తుండగా చెన్నూర్ వైపు నుంచి శ్రీరాంపూర్ వెళ్తున్న ట్రాలీ ఆటో బైక్‌ను ఢీకొట్టింది. తలకు బలమైన గాయాలు కావడంతో ముందుగా రామకృష్ణాపూర్ సింగరేణి ఏరియా ఆస్పత్రికి అక్కడి నుంచి మెరుగైన వైద్యంకోసం కరీంనగర్‌కు తరలించి చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి మృతి చెందాడు.

ఇంకా తేలని 'వాటా'

పంపిణీ చేసిన లాభాల వాటా వివరాలు..

సంవత్సరం	లాభాలు (రూ.కోట్లలో)	శాతం	చెల్లించినవి (రూ.కోట్లలో)
2010–11	286.01	16	56.16
2011–12	358.27	17	60.09
2012–13	401	18	72.18
2013–14	418	20	83.60
2014–15	491	21	103.11
2015–16	1001.17	23	230.26
2016–17	395.38	25	98.84
2017–18	1,212	27	327.84
2018–19	1,766	28	494.48
2019–20	993.86	28	278.28
2020–21	272.64	29	79.74
2021–22	1,227.04	30	368.11
2022–23	2,184	32	700



గనిలోకి దిగుతున్న కార్మికులు (ఫైల్)

- సింగరేణి లాభాల్లో వాటాకు ఉద్యోగుల ఎదురుచూపు
- కొత్త ప్రభుత్వం మార్కు చూపేనా..!

శ్రీరాంపూర్: సింగరేణిలో ప్రతీ సంవత్సరం ఇచ్చే లాభాల్లో వాటా కోసం ఉద్యోగులు ఎదురుచూస్తున్నారు. ప్రతీ ఆర్థిక సంవత్సరం ముగిసిన తర్వాత కంపెనీ సాధించిన లాభాల్లో నుంచి కొంతశాతం ఉద్యోగులకు వాటాగా చెల్లిస్తారు. 1999 నుంచి కంపెనీ లాభాల్లో వాటా చెల్లించే ఆనవాయితీ మొదలైంది. అప్పటి నుంచే కంపెనీకి లాభాలు మొదలయ్యాయి. 1999లో 10 శాతం వాటాతో మొదలైన పంపిణీ గత సంవత్సరం నాటికి 32 శాతానికి చేరింది. ఈసారి ఎంత ఇస్తారోనన్న చర్చ జరుగుతోంది. 2023–24 ఆర్థిక సంవత్సరం మార్చి 31తో ముగిసింది. ఆ సంవత్సరం నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యం 70 మిలియన్ టన్నులుకాగా నూరు శాతం సాధించింది. దీంతో కంపెనీకి ఈసారి పెద్దఎత్తున లాభాలు వస్తాయని కార్మికులు అంచనా వేస్తున్నారు. ఆర్థిక సంవత్సరం ముగిసి నాలుగు నెలలు కావస్తున్నా ఇప్పటికీ కంపెనీకి ఎంత లాభాలు వచ్చాయో యాజమాన్యం ప్రకటించడం లేదు. ప్రతీ సంవత్సరం అధికారులు ఇలాగే జాప్యం చేస్తూ వస్తున్నారని కార్మికులు వాపోతున్నారు. కంపెనీ లాభాలు ప్రకటిస్తే దానిపై గుర్తింపు సంఘం నాయకులు ప్రభుత్వంతో మాట్లాడిన తర్వాత ముఖ్యమంత్రి ద్వారా లాభాల వాటా ఎంత అనే ప్రకటన వెలువడి పంపిణీ చేయడం జరుగుతుంది.

కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆశలు..

నాటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం తొమ్మిదేళ్లుగా లాభాల వాటాను ప్రకటిస్తూ వచ్చింది. ఇప్పుడు కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరి ఉండడంతో ఈ ప్రభుత్వంపై కార్మికులు గంపెడాశతో ఎదురుచూస్తున్నారు. కంపెనీ రికార్డు స్థాయిలో బొగ్గు ఉత్పత్తి సాధించినందువల్ల లాభాల వాటాను ఈసారి 35 శాతం చెల్లించాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వాటా శాతం పెంచి తన మార్కు చూపించుకోవాలని కార్మికులు కూడా పేర్కొంటున్నారు. విద్యాసంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో పిల్లల ఫీజులు, పుస్తకాల ఖర్చు అధికంగా ఉంటుందని, ఈ సమయంలో లాభాల వాటా పంపిణీ చేస్తే ఎంతో ఉపయోగపడుతుందని అంటున్నారు. గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు, తమ ప్రభుత్వమే అధికారంలో ఉన్నందున ఐఎన్‌టీయూసీ నాయకులు యాజమాన్యంతో మాట్లాడి లాభాల లెక్క ప్రకటించి వాటా శాతాన్ని ప్రకటింపజేయాలని కోరుతున్నారు.

35 శాతం వాటా చెల్లించాలి



సింగరేణి గత ఆర్థిక సంవత్సరం సాధించిన వాస్తవ లాభాలను వెంటనే ప్రకటించాలి. లాభాల నుంచి కార్మికులకు 35 శాతం వాటా ప్రకటించాలి. కార్మికులు ఎంతో కష్టపడి కంపెనీ చరిత్రలోనే రికార్డు స్థాయిలో 70 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తిని సాధించారు. ప్రతీసారి లాభాల వాటాను ముఖ్యమంత్రి ప్రకటించడం ఆనవాయితీ. ఈ సారి కూడా వెంటనే స్పందించి లాభాలు, వాటా శాతం, ఎప్పుడు చెల్లించేది ప్రకటించాలి. – కే.సురేందర్‌రెడ్డి, టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి

ఆర్కేపీ ఆనవాళ్లు ఇక లేనట్లేనా?

రెండున్నర దశాబ్దాల క్రితం ఓ వెలుగు వెలిగిన రామకృష్ణాపూర్ ఏరియా పూర్తిగా తన అస్తిత్వం, ఆనవాళ్లు కోల్పోయే ప్రమాదంలో పడింది. ఉన్న ఒక్కగానొక్క ఆర్కే1ఏ భూగర్భ గని కొన్ని నెలల క్రితమే మూతబడగా ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్ట్ సైతం మూసివేత జాబితాలో చేరిపోనుంది. ఇక సివిల్ డిపార్ట్‌మెంట్, సీహెచ్‌పీ మూసివేస్తే రామకృష్ణాపూర్ పట్టణం పని అయిపోయినట్లే. ఒక్కో గని, డిపార్ట్‌మెంట్‌ను మూసివేస్తూ వస్తున్న యాజమాన్యం కుట్రపూరితంగానే రామకృష్ణాపూర్ కుత్తుకలు తీసేందుకు పాచికలు వేస్తోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అసలు రామకృష్ణాపూర్ పట్టణంలో ఏం జరుగుతోంది?.. ఈ ప్రాంతానికి ఎందుకీ దుస్థితి పట్టింది?..అన్న దానిపై నేటినుంచి వరుస ప్రత్యేక కథనాలు..

- ఇప్పటికే ఆర్కే1ఏ, ఆర్కే ఓసీపీ మూసివేత
- సివిల్ డిపార్ట్‌మెంట్, సీహెచ్‌పీ ఎత్తివేస్తే అంతే సంగతి



మూసివేసిన ఆర్కే 1ఏ మ్యాన్‌వే

రామకృష్ణాపూర్: మంచిర్యాల జిల్లాలోని రామకృష్ణాపూర్ పట్టణ పరిస్థితి కక్కలేక.. మింగలేక అన్నట్లు ఉంది. ఉన్న భూగర్భ గనులు మొత్తం మూతపడి తన ప్రాభవం కోల్పోయిన పట్టణం ఇప్పుడు మరీ కకావికలం అయిపోతోంది. కొన్ని నెలల క్రితం ఆర్కే 1ఏ భూగర్భ గని మూతపడగా ఇప్పుడు ఉన్న ఏకైక ఓపెన్‌కాస్ట్ గని సైతం మూడు నెలల్లో పూర్తిగా మూతబడనుంది. గతంలోనే ఆర్కే1, ఆర్కే3, ఆర్కే4, ఎంకే4, 4ఏ, తదితర గనులతో పాటు ఏకంగా ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయాన్నే మూసివేశారు. ఏరియా స్టోర్స్, ఏరియా వర్క్‌షాప్, టింబర్‌యార్డు ఇలా ఏరియా స్థాయి ఆఫీసులన్నీ మూసివేయబడ్డాయి. చివరికి ఏరియాను మందమర్రిలో విలీనం చేసిన దుస్థితి వచ్చింది. ఇక అప్పటినుండి రెండున్నర దశాబ్దాలుగా మూసివేతల పర్వమే కొనసాగుతోంది.

సివిల్ డిపార్ట్‌మెంట్, సీహెచ్‌పీ..?

ప్రస్తుతం రామకృష్ణాపూర్‌లో గుడ్డిలో మెల్లగా నడుస్తున్నవి అంటే అవి సివిల్ డిపార్ట్‌మెంట్, సీహెచ్‌పీ మాత్రమే. ఇక వాటిని కూడా మూసివేయాలనే ఏరియా ఉన్నతాధికారులు పాచికలు వేస్తున్నారు. ఈ రెండూ మూసివేతకు గురైతే రామకృష్ణాపూర్‌కు మిగిలేది శూన్యమే. మెగా ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్ట్ వస్తుందనే పుకార్లు షికార్లు చేస్తున్నా అది కార్మికవర్గాన్ని తప్పుదోవ పట్టించే ప్రయత్నమేననే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అటవీ, పర్యావరణ, మైనింగ్ అనుమతులు ఇంకా రాకపోవడంతో మెగా ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్ట్‌పై నీలినీడలు కమ్ముకోక తప్పడం లేదు. ఈ విషయంలో ఉన్నతాధికారులు సహా జాతీయ కార్మిక సంఘాల నేతలు స్పష్టత ఇవ్వకపోయినా భవిష్యత్‌లో జరిగే పరిణామాలు ఇవేనని తెలుస్తోంది. ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ జాతీయ సంఘాల నాయకులు ఉన్నా పట్టణానికి ఏం చేయడం లేదని కార్మికులు వాపోతున్నారు.

ఊగిసలాట సూచనలు ఇవే..!

రామకృష్ణాపూర్ పట్టణ పరిస్థితిపై నెలకొన్న ఊగిసలాటకు పలు సూచనలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఇప్పుడిక్కడ ఆఫీసర్స్ రిక్రియేషన్ క్లబ్ ఉన్నా దాని నిర్వహణ లేదు. అందులోని స్విమ్మింగ్ పూల్ నిర్వహణపై కూడా సింగరేణి యాజమాన్యం చేతులెత్తేసింది. అందులో నీటిని శుద్ధిని చేసే మోటార్లు కనీసం బిగించకుండా నిర్లక్ష్యం వహిస్తోంది. రైల్వేస్టేషన్ ఏరియాలో ఉన్న కమ్యూనిటీ హాల్ నిర్వహణ బాధ్యతలను కూడా అధికారులు గాలికొదిలేశారు. ఇలా ఒక్కో విభాగం కాలగర్భంలో కలిసిపోయాక మిగిలేది ఏమిటనే ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి. ఒక విధంగా చెప్పాలంటే ఊరు ఉనికినే దెబ్బతీసే కుయుక్తులు పన్నడం తప్పా ఉన్నతాధికారులకు రామకృష్ణాపూర్ పట్టణంపై ఎలాంటి పట్టింపులేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు యూటర్న్ తీసుకుని పట్టణానికి కొత్త శోభ తీసుకువస్తారో లేదో చూడాల్సిందే మరి.

మా భూములు మాకు ఇప్పించాడు..



మాట్లాడుతున్న ఆస్నాద రైతులు

చెన్నూర్‌రూరల్: చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ మా భూములు మాకు ఇప్పించాడని మండలంలోని ఆస్నాద రైతులు తెలిపారు. బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ 60 ఏళ్లకు పైగా గ్రామంలో భూములు సాగు చేసుకుంటుంటే అటవీశాఖ అధికారులు వచ్చి ఫారెస్టుకు సంబంధించిన భూములని మమ్మల్ని ఇబ్బందులు పెట్టారన్నారన్నారు. విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా వెంటనే డీఎఫ్‌వో, కలెక్టర్‌తో సమావేశం ఏర్పాటు చేసి జాయింట్ సర్వే చేయించి మా భూములు మాకు ఇప్పించిన ఘనత ఎమ్మెల్యే వివేక్‌కే దక్కుతుందన్నారు. అనంతరం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బాపాగౌడ్, సీనియర్ నాయకుడు హేమంత్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలకు ఎమ్మెల్యే కట్టుబడి ఉన్నారన్నారు. సమావేశంలో చెన్నూరి రాజేశ్, ఇంగిలి సత్తయ్య, తోట పోశయ్య, బండారి చంద్రయ్య, తోట సత్తక్క, శంకరమ్మ, ముకుం మణెమ్మ, బండారి లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఆ ఒక్కటీ అడక్కు..!

- పుట్టగొడుగుల్లా మ్యారేజ్ బ్యూరోలు
- ఉమ్మడి జిల్లాలో 300 నుంచి 400
- సంబంధాల పేరిట వేలల్లో ఫీజు వసూలు
- జాతకాలు కలవలేదంటూ బుకాయింపు



మంచిర్యాలఅగ్రికల్చర్: ఇటీవల ఓ సినిమాలో మ్యారేజ్ బ్యూరో వాళ్లు అబ్బాయిలకు పెళ్లి సంబంధం చూస్తామని వివిధ స్కీంలలో చేర్పిస్తారు. ఓ అమ్మాయి వెళ్లి అబ్బాయిని కలిసి ఇప్పుడే పెళ్లి ఇష్టం లేదని చెప్పిస్తారు. దీంతో ఆ అబ్బాయిని మరో స్కీంలో చేర్పించి మళ్లీ ఫీజు వసూలు చేస్తారు. ఈ తతంగాన్ని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని కొందరు మ్యారేజ్ బ్యూరో నిర్వాహకులు ఎప్పుడో వంటబట్టించుకున్నారు. యువతుల ఫొటోలు చూపించి మీ ఫొటో, వివరాలు కూడా అమ్మాయి వాళ్లకు నచ్చాయి. మీరు ఫీజు చెల్లించిన తర్వాత సంబంధం మాట్లాడుదాం అంటూ ఫీజు చెల్లించగానే అమ్మాయి తాలూకు బంధువుల, కుటుంబంలో ఎవరో చనిపోయారని, ఇంట్లో వారికి ఆరోగ్యం బాగాలేదని, అమ్మాయి, అబ్బాయి రాశులు, జాతకాలు కలవలేదని, మరో అమ్మాయి చూపిస్తామని బుకాయిస్తున్నారు. ఇలా అబ్బాయిలను బోల్తా కొట్టిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 300 నుంచి 400 వరకు మ్యారేజ్‌బ్యూరోలు ఉన్నట్లు తెలుస్తోంది. అన్ని కులాలు, ఉద్యోగులు, డాక్టర్లు, సాఫ్ట్‌వేర్, వ్యాపారులకు సంబంధాలు కుదుర్చుతామని, రెండోపెళ్లి సంబంధాలూ చూస్తామని విజిటింగ్ కార్డ్స్, వాల్‌పోస్టర్లు వేస్తున్నారు.

పెట్టుబడి లేని వ్యాపారం

మ్యారేజ్ బ్యూరో అనేది పెట్టుబడి లేని వ్యాపారంలా మారింది. పెళ్లి సంబంధం పేరిట రూ.5వేల నుంచి రూ.25వేల వరకు వసూలు చేస్తున్నారు. కొన్ని సామాజిక వర్గాల్లో అమ్మాయిల సంఖ్య తక్కువగా ఉంది. అబ్బాయిపై చదువులు చదివి ఉన్నతోద్యోగం చేస్తున్నా సరైన సంబంధం దొరకడం కష్టంగా మారింది. వధువు కోసం వెతుకుతున్న యువకుల కుటుంబ సభ్యులు మ్యారేజ్ బ్యూరోలను ఆశ్రయిస్తున్నారు. దీంతో అబ్బాయి చదువు, కుటుంబ నేపథ్యం, పుట్టిన తేదీ తదితర వివరాలు సేకరిస్తున్నారు. రెండు మూడు రోజుల్లో అమ్మాయిల ఫొటోలు చూపించి తప్పుడు అడ్రస్ చెబుతున్నారు. అమ్మాయిల ఫొటోలు చూపించి రూ.10వేలు ఫీజు చెల్లించండి అమ్మాయి వాళ్లతో సంబంధం మాట్లాడుతాం అంటూ వసూలు చేస్తున్నారు. డబ్బు చెల్లించిన తర్వాత పెళ్లి సంబంధం కుదర్చడంలో దాట వేస్తున్నారు. 'ఫీజు చెల్లించిన తర్వాత ఫొటో చూపించి అమ్మాయి వాళ్ల బంధువులు చనిపోయారని, అనారోగ్యంతో హైదరాబాద్ ఆస్పత్రిలో ఉన్నారని, అమ్మాయి, అబ్బాయి జాతకం కలవడం లేదని చెబుతున్నారు..' అంటూ పేరు చెప్పడానికి ఇష్టపడని ఓ యువకుడు వాపోయాడు. పట్టణాల్లోని మ్యారేజ్‌బ్యూరోల సంస్కృతి గ్రామాలకూ విస్తరించింది. వధువుల కోసం వెతుకుతున్న వారు ఎక్కువగా ఉండడంతో పెళ్లి సంబంధాలు చూస్తామని తిరుగుతూ డబ్బులు వసూలు చేస్తున్న వారి సంఖ్య పెరిగింది. ఏ సామాజిక వర్గమైనా మొదటి, రెండో పెళ్లి సంబంధం కుదుర్చుతామని నమ్మబలుకుతున్నారు. కొన్ని కుటుంబాల్లో ఆర్థికంగా బాగానే ఉన్నా ఉద్యోగం లేదని అమ్మాయిని ఇవ్వడం లేదు. కొన్ని సామాజిక వర్గాల్లో అమ్మాయిల సంఖ్య గణనీయంగా తగ్గడంతో యువకులకు 35ఏళ్లు దాటినా పెళ్లి కాని పరిస్థితి నెలకొంది. దీంతో ఎదురు కట్నం ఇచ్చి పెళ్లి చేసుకునేందుకూ కొందరు వెనుకాడడం లేదు. ఇలా పెళ్లి కుదిర్చిన మ్యారేజ్‌బ్యూరోలో రూ.లక్షల్లోనే ఫీజులు వసూలు చేస్తున్నారు. సామాజిక వర్గం పట్టింపు లేదని, ఆర్థికంగా ఉన్నతస్థాయిలో ఉన్న అబ్బాయికి పేదింటి అమ్మాయి సంబంధం కుదిర్చితే గంపగుత్తగా రూ.2లక్షల నుంచి రూ.3లక్షల వరకు డిమాండ్ చేస్తున్నారు. కొందరు దీన్ని ఆసరాగా చేసుకుని అమ్మాయి, అబ్బాయి వివరాలు, కుటుంబ నేపథ్యం తెలుసుకోకపోవడం వల్ల గొడవలకు దారి తీసి పోలీసు, కోర్టు కేసుల వరకు వెళ్లి విడాకులకు దారి తీస్తున్నాయి.

రిజిస్ట్రేషన్ లేకుండానే..

మ్యారేజ్ బ్యూరో నిర్వహణకు రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో రిజిస్ట్రేషన్, వెల్ఫేర్ కార్యాలయంలోనే ఉంది. ఉమ్మడి జిల్లాలో 90శాతం ఎలాంటి అర్హత, రిజిస్ట్రేషన్ లేకుండానే బ్యూరోలను నిర్వహిస్తున్నారు.

మూడు ముళ్ల బంధం.. మూడు నెలలే..

- హైదరాబాద్ వ్యాపార కుటుంబానికి చెందిన అబ్బాయికి బెల్లంపల్లి నియోజకవర్గంలోని ఓ మండలానికి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన అమ్మాయికి ఎనిమిది నెలల క్రితం మ్యారేజ్ బ్యూరో ద్వారా సంబంధం కుదిర్చారు. సామాజిక వర్గాలు వేరైనా కట్నం లేకుండా అమ్మాయి పైనే ఆభరణలు వేసుకుని పెళ్లి చేసుకున్నారు. ఈ సంబంధం కుదిర్చిన మ్యారేజ్‌బ్యూరో రూ.2లక్షల వరకు డిమాండ్ చేశారు. అబ్బాయి కుటుంబానికి సంబంధించి నిజానిజాలు తెలియకపోవడంతో కొన్ని నెలల్లోనే గొడవల కారణంగా పోలీసుస్టేషన్ వరకు వెళ్లినట్లు తెలిసింది.
- కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని ఆసిఫాబాద్ నియోజకవర్గం పరిధిలోని ఓ మండలానికి చెందిన అమ్మాయి మహారాష్ట్రలోని ఓ అబ్బాయికి మ్యారేజ్ బ్యూరో ద్వారా పెళ్లి సంబంధం కుదిర్చారు. అప్పటికే ఆ అబ్బాయికి పెళ్లి అయి పిల్లలూ ఉండడంతో ఇరుకుటుంబాల మధ్య గొడవలు చోటు చేసుకున్నాయి.

రుణమాఫీపై స్పష్టత కరువు

- జాబితాలో లేనివారి వివరాలు తెలియదంటున్న బ్యాంకర్లు, అధికారులు
- పేరు లేకపోవడంతో విస్తుపోతున్న లబ్ధిదారులు

కాసిపేట: ప్రభుత్వం ఎన్నికల ముందు చెప్పిన విధంగా రుణమాఫీ చేస్తున్నట్లు ప్రకటించి షెడ్యూల్ ప్రకటించడంతో పాటు అర్హులైన లబ్ధిదారుల జాబితా ప్రకటించడంతో అందులో పేరు లేని లబ్ధిదారులు అయోమయానికి గురవుతున్నారు. జాబితా విషయంలో బ్యాంకర్లు, వ్యవసాయశాఖ అధికారులను అడిగితే తమకు తెలియదని, ప్రకటించిన జాబితా మాత్రమే వచ్చిందని సమాధానం చెప్తుండడంతో ఆందోళనకు గురవుతున్నారు. రుణమాఫీ విషయంలో బ్యాంకర్లు, వ్యవసాయశాఖ అధికారులు తమకు స్పష్టత లేదని, ఇంకా ఎటువంటి ఆదేశాలు రాలేదని చెప్తుండటంతో చేసేదేంలేక మిన్నకుండి పోతున్నారు. గురువారం లక్షలోపు రుణాలు ఖాతాలలో జమ చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం జాబితాలో ప్రకటించిన విధానం, అందులో పేర్లు లేనివారికి కారణాలు మాత్రం చెప్పక పోవడం, అధికారులకు సైతం పూర్తి సమాచారం, విధివిధానాలు తెలపకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రభుత్వం వెల్లడించిన మొదటి విడత అర్హుల జాబితా ప్రకారం కాసిపేట మండలంలో 1,032 మంది అర్హులు ఉండగా, మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా 28,926 మంది ఉన్నారు. వాట్సాప్ గ్రూప్‌లలో వచ్చిన తరువాత వ్యవసాయశాఖ, బ్యాంకర్లకు జాబితా వెళ్లింది. ఏదేమైనా జాబితాలో లేని వారి కుటుంబాలు గందరగోళానికి గురవుతున్నాయి. ఖాతా లలో జమ చేసే సమయం వరకైనా అర్హుల జాబితాలో లేని వారికి కారణాలు చెప్పే విధంగా అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని కోరుతున్నారు.

రూ.11.22 లక్షల విలువైన గుట్కా పట్టివేత

వాంకిడి: రూ.11.22 లక్షల విలువ గల నిషేధిత గుట్కా పట్టుబడినట్లు ఎస్సై సాగర్ తెలిపారు. మండల కేంద్రానికి చెందిన షాహిద్ ఆటో ట్రాలీలో మంగళవారం రాత్రి మహారాష్ట్ర వైపు నుంచి వాంకిడికి వస్తుండగా జాతీయ రహదారి– 363 పై పోలీసులు తనిఖీ చేశారు. ట్రాలీలో 30 బ్యాగులు ఉండగా ఒక్కోదాంట్లో 40 మా జా(నిషేధిత పొగాకు) డబ్బాలు ఉన్నట్లు తెలిపారు. బ్యాగులను సీజ్ చేసి నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. తనిఖీల్లో ఏఎస్సై పోశెట్టి, హెడ్ కానిస్టేబుల్ శ్యాంరావు, కానిస్టేబుల్ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

మరమ్మతుల కోసం క్యూ..!

- మందు డబ్బాల రిపేరుకు పల్లెల నుంచి పట్టణాలకు...
- మెకానిక్ షెడ్ల వద్ద తప్పని ఇబ్బందులు
- సబ్సిడీ లేక రైతులకు ఆర్థికభారం



బెల్లంపల్లిలో స్ప్రేమోటార్ల మరమ్మతుల కోసం క్యూ కట్టిన రైతులు

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో రైతులు గత నెల వానాకాలం సాగు పంటలను విత్తుకున్నారు. ప్రధానంగా పత్తి విత్తనాలు వేసుకొని నెలరోజుల కాలం దగ్గర పడుతోంది. కలుపు, చీడపీడల నివారణకు వినియోగించే పిచికారీ స్ప్రే మోటార్ల మరమ్మతుల కోసం వివిధ గ్రామాల నుంచి బెల్లంపల్లి, మంచిర్యాల, చెన్నూర్, లక్సెట్టిపేట పట్టణ ప్రాంతాల్లోని మెకానిక్ షెడ్ల వద్ద రైతులు బారులు తీరుతున్నారు. ఇన్నిరోజులు నిరుపయోగంగా ఓ మూలన పడేసిన మోటార్లను, ఉపయోగంలోకి తెచ్చేందుకు మరమ్మతు చేపిస్తున్నారు. దీంతో మెకానిక్‌లకు డిమాండ్ పెరిగింది. గతంలో ప్రభుత్వం స్ప్రే మోటర్లు, ట్రాక్టర్ల యంత్రాలు కల్టివేటర్, ప్లవ్, రోటవెటర్, తదితర పరికరాలు రాయితీపై అందించేదని, ఇప్పుడు ఏమీ ఇవ్వడం లేదని.. ధర ఎక్కువైనా కొనుగోలు చేయక తప్పడం లేదని రైతులు వాపోతున్నారు. దీంతో ఆర్థికంగా చాలా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆలస్యమైతే పంటలో కలుపు మొక్కలు పెరిగిపోతాయని, పంట ఎదుగదల లోపిస్తుందని, చీడపీడల ఉధృతి పెరిగి నష్టం వాటిల్లుతుందని స్ప్రే డబ్బాలను మరమ్మతు చేయించుకునేందుకు మెకానిక్‌ల చుట్టూ తిరుగుతున్నారు.

ఎంతైనా తప్పడం లేదు..

కలుపు మందు, పురుగు మందులు కొట్టాలంటే స్ప్రే డబ్బా తప్పనిసరి. ఇన్ని రోజులు మూలకు ఉండే.. ఇప్పుడు తీసి వాడుదామని చూస్తే పని చేయడం లేదు. 20కిలోమీటర్ల దూరం నుంచి బెల్లంపల్లికి స్ప్రే డబ్బా పట్టుకొని వచ్చినా. ఇక్కడ బాగా మంది ఉన్నారు. పొద్దున వచ్చినా, సాయంత్రం వరకు ఉండాల్సి వచ్చింది. రిపేర్ చేసినందుకు మెకానిక్ ఎంతచెబితే అంత చెల్లించి తీసుకొని పోతున్నా. తప్పదు ఆలస్యమైతే పంట ఎదుగుదల లేకుండాపోతుంది. – తిరుపతి, వెంకటపూర్, భీమిని

గతంలో రాయితీపై ఇచ్చేది..

గతంలో ప్రభుత్వం రాయితీపై వ్యవసాయ పనిముట్లు, స్ప్రే డబ్బాలు ఇచ్చేది. కొన్ని ఏళ్లుగా ఇవ్వడం లేదు. బయట మార్కెట్లో కొనుగోలు చేయాల్సి వస్తోంది. ఇష్టానుసారం అమ్ముతున్నారు. వాళ్లు చెప్పిందే ధర అన్నట్లుగా సాగుతోంది. తప్పని పరిస్థితుల్లో కొనుగోలు చేయాల్సి వస్తోంది. – రాజయ్య, భీమిని